# ఇదో రకం విద్య

రైలు గమ్యంవైపు పరుగిడుతోంది. ఈ లోకంలో ఉన్న అనేక రకాల మనస్తత్వాలకూ అతి సహనంతో తనలో చోటిచ్చి రైలు గమ్యం వైపు పరుగిడుతోంది.

జయకు వరంగల్‌లో ఇంటర్వ్యూ వచ్చింది ఉద్యోగానికి.

ఆమె సికింద్రాబాదు స్టేషన్‌లో కోణార్క ఎక్కింది. రైలు కదిలే వరకు స్టేషన్లో కదులుతున్న జనాన్ని, ఎక్కేవాళ్ళనూ, దిగేవాళ్ళనూ, ఆసక్తిగా గమనిస్తుండిపోయింది. రైలు కదలగానే బ్యాగ్‌లో నుంచి 'ఇండియా టుడే'లో ఆర్టికలేదో చదువుతూ కూర్చుంది. పక్కనకూర్చున్న నీలిరంగు విమల్‌చీర ఆవిడ భుజంతట్టి మరీ పలకరించింది, "ఎక్కడి వరకూ వెళ్తున్నారు?" అని.

"వరంగల్‌కి" అంది జయ. నీలిరంగు చీరావిడతనపేరు "నీలిమ అనీ తను విజయవాడ వెళ్తున్నానని" అడగకుండానే చెప్పింది. ఆవిడది విజయవాడట, హైదరాబాదులో తన అన్నగార్ని చూడాలని వచ్చాననీ, తిరిగి వెళ్తున్నాననీ, తన భర్త పెద్దబిజినెస్ చేస్తాడనీ ఇద్దరు మగపిల్లలనీ, ఇంటర్ చదువుతున్నారనీ, విజయవాడలో స్వంత ఇల్లుందనీ తన విషయా లన్నీ ఏకరువు పెట్టింది. జయ మితభాషి. ఏవో ఒకటి రెండుమాటలడిగి, ఒకటిరెండు సమాధానాలు మాత్రం చెప్పింది.

"మీమెళ్ళో రాళ్ళనెక్లెస్ చాలా బాగుందండీ- ఇట్లాంటిదే కావాలని మావార్ని చాలా రోజులుగా అడుగుతున్నాను- ఏదీ- ఆయనకు శ్రద్ధలేదు తీరుబడేలేదు...." అంది నీలిమ, మెరిసే కళ్ళతో జయమెళ్లో నెక్లెస చూస్తూ.

"ఎన్ని గ్రాములు? ఎక్కడ చేయించారు? మొత్తం ఎంత దబ్బైంది?" అంటూ చాలా ప్రశ్నలు గుప్పించి చివరకు "ఒకసారిస్తారా చూసిస్తాను" అంది నీలిమ.

జయ తన మెళ్ళో నెక్లెస్ తీసి నీలిమ చేతికి అందించింది.

"అబ్బా చాలా బరువుందండీ. చాలా బాగా చేశాడు కంసాలి" అంటూ తెగ మురిసిపోతూ తన మెళ్ళో అలంకరించుకుని "నాకు ఎట్లా ఉందండీ" అంది.

ఆవిడ నగల పిచ్చికి నవ్వుకుంటూ "చాలా బాగుంది" అంది.

ఒక గంట గడిచిపోయింది. రైలు భువనగిరి స్టేషన్ దాటేవరకూ ఏదో కబుర్ల కాలక్షేపం జరిగింది. ఇంకో అరగంటలో కాజీపేట స్టేషన్ వస్తుందనగా జయ పైనపెట్టిన తన బ్యాగ్ అందుకుని తన పక్కన పెట్టుకుంటూ "ఏమండీ! నెక్లెస్ ఇస్తారా? నా స్టేషన్‌వచ్చేస్తోంది" అంది.

"ఏ నెక్లెస్?" అంది తెల్లబోతూ నీలిమ.

"మీరు హాస్యంలో కూడా మంచి నేర్పరులే" అంది. ఆమె మాట లను హాస్యం అనుకోవాలనే ప్రయత్నం చేస్తూ.

"హాస్యమేమిటి?" పాపం ఆవిడ మరింత తెల్లబోయింది.

జయ మొహం పాలిపోయింది. "అదేమిటండీ! నా నెక్లెస్ పెట్టుకు చూస్తానని తీసుకున్నారు కదా!" అంది ధైర్యాన్ని కూడదీసుకుంటూ. ఆమె గుండెలు చాలా వేగంగా కొట్టుకుంటున్నై. ఆ నగ సరికొత్తది. చేయించి నాలుగు రోజులుకూడా కాలేదు.

"మీ నెక్లెస్ పెట్టుకుచూసే ఖర్మ నాకేం పట్టింది? ఇదినేనే చేయించుకున్నాను. అక్షరాల ఇది నాది" అంది.

జయకు దుఃఖం పొంగివస్తోంది. ఆమె మధ్యతరగతి మనసు నలిగి పోతోంది. ఈ గొడవ, ఘర్షణలకు కంపార్టుమెంటులోని వాళ్ళంతా జమ అయినారు. అయితే జయ నీలిమకు గొలుసు ఇవ్వడం చూసిన సాక్షులెవరూ లేరు.

ఎంత వాదించినా, ఎంత గొడవ చేసినా నీలిమ ఖచ్చితంగా ఆ నెక్లెస్ తనదేనంటుంది. దాని అసలుహక్కుదారు జయ తానే దోషిలా నుంచుంది. ఇంత దారుణంగా జరిగిన మోసాన్ని ఎట్లా ప్రతిఘటించాలో అర్థం కావడం లేదామెకు. తన నెక్లెస్, ఎన్నాళ్లగానో తను కోరుకుని ఎంతో కష్టపడి దాచుకున్న ఆ సొమ్ము ఎట్లా దక్కించుకోవాలో తెలియడం లేదామెకు.

ఖాజీపేటస్టేషన్‌లో రైలు ఆగింది. నీలిమ అక్కడ పోలీస్ కంప్లైంట్ ఇచ్చింది, చివరి ప్రయత్నంగా. వాళ్లు సవాలక్ష ప్రశ్నలడిగారు.

అసలీ పరిస్థితి రావడమే అవమానకరంగా ఉందామెకు. అసలు దోషి ఘరానాగా, బాగానే ఉంది. దొంగ తనేనన్నట్లు చూస్తున్న పలువురి చూపులు బాణాల్లా గుచ్చుకుంటున్నై. మనసుకు పెద్దగాయమే అయింది జయకు.

పోలీస్ ఇన్స్పెక్టర్ అడిగాడు, ఇద్దర్నీకూడా. ఈ నెక్లెస్ ఎప్పుడు ఎక్కడ చేయించుకున్నారు? వెయిట్ ఎంత? మొదలైన ప్రశ్నలన్నిటికీ చాలా అన్యమనస్కంగా జవాబిచ్చింది జయ. "ఒకసారి చూపిస్తానని తీసుకుని ఇప్పుడు ఆ వస్తువు తనది అంటున్నదావిడ" అన్న తన మాటలు పోలీసులు విశ్వసించినట్లు కనిపించలేదు.

చివరిగా పోలీస్ ఇన్స్పెక్టర్ ఒక ప్రశ్న అడిగాడు. "ఈనెక్లెస్‌లో రాళ్ళు ఎన్ని ఉన్నై?" అని. ఇది ఎవరు సరిగ్గా చెప్తే ఈ నెక్లెస్ వాళ్ళదిగా నమ్మవచ్చు అన్నట్లుందతని ధోరణి.

ఈ ప్రశ్నకు జయ తెల్లబోయింది. ఎందుకంటే, అందులో రాళ్ళెన్నో ఆమె లెక్కించలేదు.

కానీ నీలిమ టక్కున చెప్పింది, అందులో ఉన్న రాళ్ళ సంఖ్య. పోలీసులు లెక్కపెడ్తే ఆ రాళ్ళ సంఖ్య నీలిమ చెప్పిన సంఖ్యతో సరిపోయింది. నీలిమ అతి తెలివితేటలకు చాలా ఆశ్చర్యపోయింది జయ. అంత ఖచ్చితంగా ఎప్పుడు లెక్కపెట్టిందో అర్థంకాలేదామెకు. అంతా ఒక ప్రణాళిక ప్రకారం చేసిందన్నది మాత్రం చాలా ఆలస్యంగా అర్థమైంది.

నీలిమ విజయగర్వంతో చూసింది జయవైపు. జయ ఇక తనకు వాదించే శక్తిలేనట్లు స్తబ్ధంగా ఉండిపోయింది. తనదైన వస్తువును తన దిగా నిరూపించుకోలేక పోవడం అటుంచి తన వస్తువుకు తానే దొంగగా మారిన సన్నివేశానికి కుములుతూ ధ్వజమెత్తిన అవినీతిని, అన్యాయాన్ని కన్నీళ్ళ మధ్య పరికిస్తూ బాధగా కదిలింది అక్కడ్నించి జయ.

(మరోసమాజం 3-11-1986)